# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 23 జులై 2024 | www.balagamtv.com | పేజీలు 4


## మరో మూడు రోజులు వర్షాలు..


- అప్రమత్తంగా ఉండాలి : సీఎస్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు వర్షాలు పడనున్నందున అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ శాంతికుమారి తెలిపారు. వర్షాలపై కలెకర్టలు, ఎస్పీలు, సీపీలతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పునరావస కేంద్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వర్షాలకు చెరువులు, కుంటలు తెగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. భద్రాచలం వద్ద 53 అడుగులకు చేరితో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ తెలిపారు. మండలాల వారీగా అధికారులు ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉన్నామని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ హెచ్చరించారు. భద్రాద్రి, ములుగు జిల్లాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ బలగాలను మోహరించామని శాంతికుమారి తెలిపారు.

# సంక్షోభంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ





- పట్టించుకోని సర్కార్
- సిరిసిల్ల నేతన్నలను ఆదుకోండి..
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 8 మంది ఆత్మహత్య
- బతుకమ్మ చీరలు రద్దు చేశారు.. విద్యుత్ రాయితీ ఎత్తివేశారు
- దిక్కుతోచని స్థితిలో సిరిసిల్ల నేతన్నలు
- సమస్యల పరిష్కారం కోసం సిరిసిల్లలో రీలే నిరహార దీక్షలు


బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది. బీఆర్ఎస్ సర్కార్ పోయాక.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సిరిసిల్ల నేతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యల నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరల అర్డర్లు తీసుకువచ్చి సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించారు. గత పదేండ్లు సిరిసిల్ల నేతన్నలకు చేతి నిండ పని, కడుపు నిండా తిండి దొరికింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. బతుకమ్మ చీరలు అర్డర్లు ఎత్తివేయడం, విద్యుత్ రాయితీ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో వస్త్ర పరిశ్రమ బంద్ పడింది. సిరిసిల్ల నేతన్నలకు ఉపాధీ కరువైంది. గడిచిన 7 నెలల వ్యవధిలో 8 మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. సాంచెలు అమ్ముకుంటున్నారు. రావాల్సిన బతుకమ్మ చీరల బకాయిలు రాలేదు. దీంతో సిరిసిల్ల నేతన్నలు అప్పుల కుంపట్లో కూరుకుపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నేత కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, వస్త్ర పరిశ్రమ యజమానులు పలుసార్లు విజ్ఞప్తులు చేసిన ప్రభుత్వం పట్టించుకో వకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో పార్టీలకు అతీతంగా పవర్ లూంస్, వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో రీలే నిరహార ధీక్షలకు పూనుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 25న అసెంబ్లీ ముట్టడికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. సిరిసిల్ల నేతన్నలకు ప్రభుత్వం ఉపాధీ కల్పించి ఆత్మహత్యలు నివారిం చాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల నేతన్నలకు చేయూత నివ్వాలన్నారు.వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 10శాతం యారన్ రాయితి,త్రిఫ్ట్, నేతన్న భీమా పథకాన్ని యధావిధిగా కొనసాగించాలన్నారు. సిరిసిల్ల లో యారన్ డిపో ఏర్పాటు చేసి ప్రభుత్వమే యారన్ సరఫరా చేయాలన్నారు. జనతా వస్త్ర పథకాన్ని అమలు చేయా లన్నారు.యారన్ కొనుగోలు పై 20 శాతం రాయితి అందిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పవర్ లూం వర్కర్ యూనియన్ నేతలు కూరపాటి రమేశ్, కోడం రమణ, మూషం రమేశ్, వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు తాటిపాముల దామోధర్, ఆడెపు భాస్కర్, పిస్క మధు తదితరుల పాల్గొన్నారు.

### బీజేపీ మహిళ నేత రాణిరుద్రమ మద్దతు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్ష శిబిరం సందర్శించి వస్త్ర పరిశ్రమ జేఏసీకి బీజేపీ తరఫున పూర్తి మద్దతు పలికారు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ. మున్సిపల్ మాజీ చైర్మన్ పార్లమెంట్ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎనగంటి నరేష్ ఉపాధ్యక్షులు గాజుల సదానందం, మోర శ్రీహరి, ఊరగొండ రాజు, దాసరి శ్రీనివాస్, గాజుల వేణు, కోడం ఆనంద్ బాబు, దుమాల శ్రీకాంత్ , కోడం శ్రీనివాస్, సుంచు ప్రకాష్, అంకారపు రాజు, గుడ్ల సురేష్, మెరుగు శ్రీనివాస్, కోరంపల్లి రమేష్, బాల్సాని అనిల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







### ఔషధాలు తగ్గించుకొని
## పాడి పంటలపై దృష్టిపెట్టండి

- సమృద్ధిగా వర్షాలు
- ప్రజలపై నా దీవెనలు ఉంటాయని
- రంగం భవిష్యవాణిలో మాతాంగి స్వర్ణలత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ లష్కర్ బోనాల జాతరలో రెండో రోజైన సోమవారర్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో రంగం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. అమ్మవారి ఎదురుగా పచ్చి కుండపై నిలుచుని స్వర్ణలత భవిష్యవాణి పలికారు. ఈ ఏడాది కోరినన్ని వర్షాలు కురుస్తాయన్నారు. పాడి, పంటలు సమృద్ధిగా ఉంటాయన్నారు. భక్తులు కోరిన కోరికలు తీరుస్తానని చెప్పారు. తనకు మట్టి బోనాలు, స్వర్ణ బోనాలు ఏం తీసుకొచ్చినా సంతోషంగా అందుకుం టానన్నారు. ప్రజలపై తన దీవెనలు ఉంటాయని అమ్మవారు భవిష్యవాణి వినిపించారు. ప్రజలను కాపాడేది తానే అని చెప్పారు. తనకు ఏమిచ్చిన ఆనందంగా అందు కుంటానని అన్నారు. పిల్లాజెల్లా, గొడ్డుగోదాకు ఎటువంటి ఆపద లేకుండా చూస్తానని వెల్లడించారు. ఈ ఏడాది ఐదు వారాల పాటు తనకు పప్పు బెల్లంతో సాక పెట్టాలని భక్తులను అమ్మవారు కోరారు. ఔషధాలు తగ్గించుకొని పాడి పంటలపై దృష్టిపెడితే అనారోగ్యం అనేది తగ్గుతుం దన్నారు. వర్షంలో తడిచి మరీ భక్తులు బోనాలు సమర్పించి.. దర్శించుకున్నారంటూ అమ్మవారికి పూజా రులు తెలుపగా.. ఆ మాత్రం కష్టపడాలని... లేకపోతే సోమరిపోతులు అవుతారని అమ్మవారు పలికారు. రంగం కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు సీఎస్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు. కాగా, బోనాల జాతరలో భాగంగా ఇవాళ మధ్యాహ్నం అంబారిపై మహంకాళి అమ్మవారి ఊరేగింపు ఉంటుంది. సాయంత్రం ఫలహార బండ్ల ఊరేగింపు జరగనుందని ఆలయ నిర్వహకులు వెల్లడించారు.

### ఆర్థిక సర్వేను
## ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

- మన ఆర్థిక వ్యవస్థ పటిష్టం : ఆర్థిక సర్వేలో నిర్మలా సీతారామన్
- నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మంత్రి

వివరాలు 2వ పేజీలో

### నీట్ పేపర్ లీకేజీపై
## దద్దరిల్లిన లోక్ సభ



- ప్రభుత్వాన్ని నిలదీసిన రాహుల్ గాంధీ..
- ఆరోపణలను తోసిపుచ్చిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

నీట్ పేపర్ లీకేజీపై లోక్ సభ దద్దరిల్లింది. పార్లమెంట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి.తొలిరోజే నీట్ కేంద్రంగా అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల తూటాలు పేలాయి.సభ ప్రారంభం కాగానే నీట్ పేపర్ లీక్ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ప్రారంభ మైంది. విపక్షం తరుపున కేసీ వేణుగోపాల్, అఖిలేశ్ యాదవ్, రాహుల్ గాంధీలు ప్రశ్నలు సంధించగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమాధానం ఇచ్చారు. నీట్ పేపర్ లీక్ చాలా పెద్ద సమస్య అని రాహుల్ గాంధీ అన్నారు.ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నీట్ పేపర్ లీక్ అంశంపై మాట్లాడారు. విద్యావ్యవస్థను నాశనం చేశారంటూ, పేపర్ లీకేజీలో రికార్డ్ సృష్టించారంటూ ఎద్దేవా చేశారు. డబ్బున్నోళ్ళు విద్యావ్యవస్థను కొనేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీక్ అనేది తీవ్రమైన సమస్య అని.. దీనికి విద్యాశాఖ మంత్రితో సహా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యతగా రాజీనామా చేయాలన్నారు. నీట్‌లోనే కాకుండా అన్ని ప్రధాన పరీక్షల్లోనూ మన పరీక్షా విధానంలో చాలా తీవ్రమైన సమస్య ఉందని దేశం మొత్తానికి స్పష్టంగా అర్థమైందన్నారు. ప్రతిష్టాత్మక పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) పేపర్ లీక్ , వాట్సాప్ ద్వారా 'లీక్ అయిన ప్రశ్నపత్రం' వ్యాప్తిని అంగీకరించిందన్నారు. సంపన్నులైతే డబ్బు చెల్లించి దేశ పరీక్షల వ్యవస్థను కొనుగోలు చేయవచ్చని విద్యార్థులు నమ్ముతున్నారని చెప్పారు. విద్యార్థుల్లో నెలకొన్న భావనే విపక్షం కూడా కలిగి ఉందన్నారు. ఈ వ్యవహారంపై ఒక రోజంతా చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తోసిపుచ్చారు. తన పర్యవేక్షణలో ఎక్కడా ప్రశ్నాపత్రాలు లీక్ కాలేదని చెప్పుకొచ్చారు. గత ఏడేండ్లలో ఎక్కడా పేపర్ లీక్‌లకు సంబంధించి ఆధారాలు లభించలేదని అన్నారు. నీట్ వ్యవహారం సుప్రీంకోర్టు ముందున్నదని, ఎన్టీఏ అమలు తర్వాత 240కిపైగా విజయవంతంగా నిర్వహించామని తాను పూర్తి విశ్వాసంతో చెప్పగలనని పేర్కొన్నారు. నీట్ వివాదాన్ని చక్కదిద్దేందుకు మీరేం చర్యలు తీసుకున్నారని రాహుల్ ప్రశ్నించగా గట్టిగా అరిచినంత మాత్రాన అసత్యం నిజం కాబోదని అన్నారు. దేశ పరీక్షల వ్యవస్థ సవ్యంగా లేదని విపక్ష నేత చేపట్టడం ఖండించాల్సిన విషయమని మంత్రి పేర్కొన్నారు.

## నేటి నుంచి అసెంబ్లీ



- ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశాల ప్రారంభం
- ముందుగా మాజీ ఎమ్మెల్యే లాస్యనందితకు సంతాపం
- అనంతరం సభా వ్యవహారాల కమిటీ భేటీ
- తొలిసారి ప్రతిపక్ష నేతగా కేసీఆర్ హాజరయ్యే అవకాశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మంగళవారం మొదలవనున్నాయి. ఉదయం 11 గంటల కు శాసనసభ ప్రారంభమవుతుంది. అనంతరం దివంగత ఎమ్మెల్యే లాస్య నందితకు అసెంబ్లీ సంతాపం తెలుపుతుంది.. లాస్య నందితకు సంతాపం తెలిపే తీర్మానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రవేశపెడుతారు. అనంతరం శాసనసభ నిరవధికంగా వాయిదాపడనున్నది. సభ వాయిదా అనంతరం సభా వ్యవహారాల కమిటీ భేటీ కానున్నది. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశాల పనిదినాలు, అజెండాను బిజినెస్ అడ్వైజరీ కమిటీ ఖరారు చేయనున్నది.

ఇక సమావేశాల్లో ముందుగా గవర్నర్ ప్రసంగం ఉండనుంది.. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు బిజీబిజీగా ఉన్నారు. 25న అసెంబ్లీకి హాజరై తెలంగాణ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క.



### తొలిసారి ప్రతిపక్ష నేతగా కేసీఆర్

తెలంగాణ బడ్జెట్ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత , మాజీ సీఎం కేసీఆర్ ప్రతిపక్ష నేత హెూదాలో తొలిసారి అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాబోతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నేటి నుంచి జరగనున్నాయి. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో తొలి రోజే పాల్గొనాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ప్రతిపక్ష నేతగా మొదటిసారి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరుకానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఒక వేళ కేసీఆర్ ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వస్తే ప్రజా సమస్యలపై తమ వాదనను బలంగా వినిపించే అవకాశం ఉంది. ఏదైమైనా కేసీఆర్ అసెంబ్లీకి రానున్నారన్న వార్త రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిని రేపింది.

# ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

- **మన ఆర్థిక వ్యవస్థ పటిష్టం : ఆర్థిక సర్వేలో నిర్మలా సీతారామన్**
- **నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మంత్రి**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇక ఎన్డీఏ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్‌ను మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టబోతోంది. ఈ క్రమంలో బడ్జెట్‌కు ఒక రోజు ముందుగా ఇవాళ 2023-24 ఆర్థికసర్వేను ఆర్థిక మంత్రి లోక్ సభలో ప్రవేశపెట్టారు. భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటూ భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పటిష్టంగా ఉందని ఈ ఆర్థిక సర్వేలో కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ అస్థిరతల నడుమ అధిక వృద్ధి ఆకాంక్షలు కలిగిన దేశానికి మార్పు మాత్రమే స్థిరంగా ఉంటుందని ఈ సర్వే తెలిపింది. వాణిజ్యం, పెట్టుబడులు, వాతావరణం వంటి కీలకమైన ప్రపంచ సమస్యలపై ఒప్పందాలను చేరుకోవడం కష్టంగా మారిందని పేర్కొంది.2022 నుంచి ప్రైవేటు రంగం పెట్టుబడులు పెడుతున్నప్పటికీ కొన్నేళ్లుగా ప్రభుత్వ పెట్టుబడులు మూలధనాన్ని కొనసాగించాయని ఈ ఆర్థిక సర్వే స్పష్టంచేసింది. గడచిన రెండు సంవత్సరాలుగా 7.0 శాతం వృద్ధిరేటును నమోదు కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో అధికంగా 9.7 శాతం వృద్ధిరేటు నమోదయ్యే అవకాశం ఉందని ఈ ఆర్థిక సర్వే అంచనా వేసింది. కొన్ని నిర్దిష్ట ఆహార ఉత్పత్తుల ద్రవ్యోల్బణం పెరిగినప్పటికీ, ప్రధాన ద్రవ్యోల్బణం చాలావరకు నియంత్రణలో ఉందని తెలిపింది.

2023 కంటే 2024లో వాణిజ్యలోటు తక్కువగా ఉందని ఆర్థిక సర్వే వెల్లడించింది. జీడీపీలో కరెంట్ ఖాతా లోటు దాదాపు 0.7 శాతంగా ఉందని పేర్కొంది. ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కరెంట్ ఖాతా మిగులును నమోదు చేసినట్లు తెలిపింది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఈ ఆర్థిక సర్వే పేర్కొన్నది. 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని ఈ సర్వే సూచించింది. 2023-24 ఆర్థిక సర్వేను ఆర్థిక మంత్రిత్వశాఖలోని ఆర్థిక వ్యవహారాల విభాగం రూపొందించింది.

దేశంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యానికి ప్రాధాన్యత పెరుగుతుందని సర్వే తెలిపింది. ఈ ఏడాది ఎన్‌హెచ్‌ఏఐ కోసం 33 ఆస్తులు విక్రయించడానికి గుర్తించబడ్డాయి. ప్రయివేటు రంగం లాభం పెరిగిందని, కానీ ఉపాధి అవకాశాలు అందుకు అనుగుణంగా పెరగలేదని కూడా చెబుతోంది. వ్యవసాయంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సర్వే ప్రస్తావించింది. భవిష్యత్తులో భారతదేశ ఆర్థిక ఆరోగ్యం ఎలా ఉంటుందో ఆర్థిక సర్వే గుర్తు చేసింది. భౌగోళిక-రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని ఆర్థిక సర్వే 2024లో చెప్పబడింది. ఇందులో మానసిక ఆరోగ్యం, వ్యవసాయంపై దృష్టి సారించాలని వెల్లడించింది.మరోవైపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇబ్బందులు ఉన్నాయని, ఇది మూలధన ప్రవాహాలపై ప్రభావం చూపుతుందని ఆర్థిక సర్వే పేర్కొంది. సేవారంగంలో ముందు మంచి వృద్ధి ఉండవచ్చు. ఉద్యోగావకాశాల కల్పనలో కార్పొరేట్ రంగం పాత్ర పెరగాలి. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం రేటు 2023 మొదటి మూడు నెలల్లో 6.7 శాతానికి తగ్గుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీ రంగంలో పెద్దగా నియామకాలు జరగడం లేదు. పెరుగుతున్న శ్రామికశక్తి అవసరాలను తీర్చడానికి భారత ఆర్థిక వ్యవస్థ 2030 నాటికి వ్యవసాయేతర రంగంలో ఏటా సగటున 78.5 లక్షల ఉద్యోగాలను సృష్టించాలి.



### నేడు కేంద్ర బడ్జెట్

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఇక మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దాంతో వరుసగా ఏడు ఫుల్‌టైమ్ బడ్జెట్లు ప్రవేశపెట్టిన ఏకైక మంత్రిగా నిర్మలమ్మ రికార్డు క్రియేట్ చేయనున్నారు. 2019లో నరేంద్ర మోడీ రెండోసారి ప్రధాని అయినప్పుడు నిర్మల సీతారామన్‌ను ఆర్థిక మంత్రిగా నియమించారు. దీంతో భారతదేశ చరిత్రలో పూర్తిస్థాయి ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా ఆమె అరుదైన ఘనత సాధించారు. అప్పటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌తో కలిపి వరుసగా ఆరు బడ్జెట్లను సమర్పించారు.

. 1959-1964 మధ్య వరుసగా ఐదు పూర్తిస్థాయి బడ్జెట్లు, ఒక మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టి మొరార్జీ దేశాయ్ రికార్డు నెలకొల్పారు. దానిని గతేడాదే నిర్మలమ్మ బ్రేక్ చేశారు. మరికొద్ది గంటల్లో ఆమె అత్యధికంగా వరుసగా 7 బడ్జెట్లను ప్రవేశపెట్టిన తొలి ఆర్థిక మంత్రిగా నిలుస్తారు.

# గంజాయి కేసులో ఇద్దరు అరెస్ట్...

- **100 గ్రాముల గంజాయి, ఒక బైక్, రెండు మొబైల్స్ స్వాధీనం.**
- **సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి**

**బలగం టీవీ, సిరిసిల్ల**

గంజాయి కేసులో ఇద్దర్నీ అరెస్టు చేసి, వారి వద్ద నుండి 100 గ్రాముల గంజాయి,ఒక బైక్, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సోమవారం సిరిసిల్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్ తో కలిసి సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి గ్రామనికి చెందిన చింతలపల్లి నాగిరెడ్డి కరీంనగర్ లో ఒక వాటర్ ప్లాంట్ లో పని చేస్తూ కరీంనగర్ కి చెందిన గుర్రాల నిఖిల్ రెడ్డి తో పరిచయం ఏర్పడగా, ఇద్దరు గంజాయి తాగడానికి అలవాటు పడ్డారు. సోమవారం కరీంనగర్ లో ఓ వ్యక్తి వద్ద తాగడానికి ,అమ్మడానికి గంజాయి కొనుగోలు చేసి ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామంలో అమ్మడానికి వస్తున్నారన్న సమాచారం మేరకు వంతడుపుల గ్రామ శివారు లో తనిఖీలు చేపట్టగా, వారి వద్ద నుండి 100 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. యువత గంజాయికి అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని తరచు వారిని గమనిస్తూ ఉండాలన్నారు.ప్రజలు ఎవరైనా గంజాయి కి సంబంధించిన సమాచారం డయల్100 లేదా టాస్కోర్స్ సీఐ ఫోన్ నెంబర్ 87126 56392 కి సమాచారం అందించగలరని తెలిపారు. గంజాయి అక్రమంగా రవాణా చేసిన,విక్రయించిన తగిన వారిపట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుంది అని హెచ్చరించారు.

# స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి




- **మాజీ అధికారిణి బాలలత డిమాండ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

దివ్యాంగులను ఐఏఎస్ పోస్టులలో పరిగణలోకి తీసుకోరాదంటూ తెలంగాణ ఐఏఎస్ స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలను మాజీ అధికారిణి బాలలత తీవ్రంగా ఖండించారు. ఆమె వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం బాలలత సోమాజీ గూడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. అంగవైకల్యం ఉన్నవారి గురించి మాట్లాడటానికి స్మితా సబర్వాల్‌కు ఉన్న అర్హత ఏంటో చెప్పాలన్నారు. జ్యుడిషియరీ, పార్లమెంటరీ వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు వ్యతిరేకంగా మాట్లాడుతుందని, అసలు ఫీల్డ్ లో పరిగెత్తుతూ స్మితా సబర్వాల్ ఎంతకాలం పనిచేసిందని ప్రశ్నించారు. వివక్షకు గురవుతున్న దివ్యాంగులను స్మితా సబర్వాల్ మాటలు మరింత కుంగదీశాయని, చట్ట వ్యతిరేకంగా ఆమె మాట్లాడారని తెలిపారు.

సీఎం అయ్యాక రేవంత్ రెడ్డి మొదటి అపాయింట్ మెంట్ దివ్యాంగురాలికి ఇచ్చారని గుర్తు చేశారు. స్మితా తన మాటలు వ్యక్తిగతంగా మాట్లాడుతుందా.. ప్రభుత్వం తరపున మాట్లాడుతుందా అనేది తేల్చాలన్నారు. కోడ్ ఆఫ్ కండక్ట్, సివిల్ సర్వీసెస్ క్రమశిక్షణ రాహిత్యం కింద స్మితా సబర్వాల్‌పైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. స్టీఫిన్ హాకింగ్, సుధా చంద్రన్ వంటి మేధావులు అంగవైకల్యం జయించారని, సూదిని జైపాల్ రెడ్డి ఉత్తమ పార్లమెంటరీయన్‌గా నిలిచారని,అంగవైకల్యంతో పద్మశ్రీ, పద్మ భూషన్ అవార్డులు తీసుకున్నవారు ఉన్నారని గుర్తు చేశారు. మీరు రాజీనామా చేసి రండి.. ఇద్దరం మళ్లీ పరీక్ష రాద్దాం. మనిద్దరిలో ఎవరికి ఎక్కువ మార్కులు వస్తాయో చూద్దామని స్మితా సభర్వాల్‌కు బాలలత సవాల్ విసిరారు. ఆమె పిజికల్లీ ఫిట్.. మెంటల్లీ అన్‌ఫిట్‌గా ఉందని, కేసీఆర్ హయాంలో పదేళ్ల పాటు సీఎంవోలో పనిచేసి కనీసం అడ్మినిస్ట్రేషన్ పైన అవగాహన లేకుండా మాట్లాడటం బాధాకరమన్నారు.

24 గంటల్లో స్మితా సబర్వాల్ తన మాటలు వెనక్కి తీసుకోవాలి అని డిమాండ్ చేస్తున్నామని, రేపటి లోగా ప్రభుత్వం ఈ అంశం పైన రియాక్ట్ అవ్వకపోతే టాంక్ బండ్ పైన జైపాల్ రెడ్డి స్మృతి వనం వద్ద నిరసన దీక్ష చేపడుతామని హెచ్చరించారు. స్మితా సభర్వాలపై సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి తగిన చర్యలు తీసుకోవాలని బాల లత డిమాండ్ చేశారు.

మరోవైపు స్మితా సబర్వాల్.. బాలలత వ్యాఖ్యలపై ట్విటర్ వేదిగా స్పందిస్తూ ఐఏఎస్ మాదిరిగా ఐపీఎస్, ఐఎఫ్‌వో, రక్షణ దళాల్లో కూడా దివ్యాంగులను పరిగణలోకి తీసుకోవడం లేదని, వాటికి ఐఏఎస్ భిన్నం కాదని నా వ్యాఖ్యల కోణంలో ఈ అంశాన్ని కూడా హక్కుల సంఘాలు పరిశీలించాలన్నారు. సున్నితత్వానికి నా మనసులో స్థానం లేదంటూ వ్యాఖ్యానించారు



# సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే...

- **ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ ఆఫీస్ లో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ప్రజలనుండి ఎస్పీ అఖిల్ మహాజన్ స్వయంగా దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని అందులో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 18 ఫిర్యాదులు స్వీకరించామని అన్నారు.భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని అన్నారు .గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు.

# ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దు..

- **అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్..**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అధికారుల ను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రజల నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ ప్రజావాణి కు వచ్చే దరఖాస్తులు పెండింగ్ లో పెట్టవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ కవి జూకంటి జగన్నాథంకు సన్మానం



- **సన్మానించిన సిరిసిల్ల పురపాలక సంఘం చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతిష్టాత్మక దాశరథి సాహితీ పురస్కారం ఈ సంవత్సరం సిరిసిల్ల వాసి అయిన ప్రముఖ కవి శ్రీ జూకంటి జగన్నాథం పొందిన సందర్భంగా పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి దంపతులు జూగంటి జగన్నాథం ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మానించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ% ప్రముఖ కవి రచయిత శ్రీ జూకంటి జగన్నాథం కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అత్యుత్తమ సాహితీ పురస్కారం శ్రీ దాశరథి కృష్ణమాచార్య పురస్కారం లభించడం మనందరికీ ఎంతో గర్వకారణం అని అన్నారు.. దాదాపుగా మూడు దశాబ్దాలకు పైగా జూకంటి జగన్నాథం వారి కవిత ప్రస్థానాన్ని కొనసాగిస్తూ శ్రమ దోపిడీ, రాచరికపు వ్యవస్థ, ప్రభుత్వ వైఫల్యాలు ఇలా మొదలగు అంశాలపై కవితలు రచనలను కొనసాగిస్తూ ప్రజలను చైతన్యపరిచి ప్రజలచే మట్టికవి అని పిలిపించుకొని దాదాపు ఇప్పటివరకు 11 అత్యుత్తమ పురస్కారాలను పొందిన మహానుభావుడు శ్రీ జూకంటి జగన్నాథం అని అన్నారు.. ఈరోజు తెలంగాణ రాష్ట్ర అత్యుత్తమ సాహితీ పురస్కారం శ్రీ దాశరథి కృష్ణమాచార్య పురస్కారం పొందిన సందర్భంగా జూగంటి జగన్నాథం ని సన్మానించుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు..

# బతుకమ్మ చీరెల బకాయిలు వడ్డీతో సహా చెల్లించాలి..

- **నేతన్నలకు విద్యుత్ సబ్సీడీ ఇవ్వాలి..**
- **బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ..**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల నేతన్నలకు బతుకమ్మ చీరెల బకాయిలను వడ్డీతో సహా ప్రభుత్వం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ అన్నారు. సోమవారం సిరిసిల్లలో పవర్ లూమ్స్, వస్త్రా పరిశ్రమ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిది రాణిరుద్రమ మాట్లాడుతూ ఒకప్పుడు సిరిసిల్ల క్లాత్ ఒక బ్రాండ్ లా ఉండేదని,స్వంతంగా మార్కెట్ చేసుకునే పరిస్థితి ఉండేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో బతుకమ్మ చీరెల పేరిట ఆదుకుంటామని చెప్పి నాసిరకం చీరెలను ఉత్పత్తి చేయించారని, కార్మికులు రాత్రనక,ఎగలనకా పని చేస్తే 15వేల కూలీ దొరికిందని అన్నారు.బతుకమ్మ చీరెలతో కొంతమంది ఆసాములు లాభం పడ్డారు తప్ప, కార్మికులకు న్యాయం జరగలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం చీరెలు ఉత్పత్తి చేయించుకుని బకాయిలు పెండింగ్ లో పట్టిందన్నారు. బతుకమ్మ చీరెల బకాయిలతో సిరిసిల్ల నేతన్నలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని,అప్పుల్లో నేతన్నలను ఆదుకునేందుకు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో సహా నేతన్నలకు చెల్లించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి పోటీ చేసినప్పుడు ఇంటింటా తిరిగానని, నేతన్నల సాదకబాధలను తెలుసుకున్నానని అన్నారు. కార్మికులు జీవితాల్లో వెలుగు నింపేందుకు ప్రభుత్వాలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.




నేతన్నలకు విద్యుత్ సబ్సీడీ అందించాలని, కార్మికులకు చేతినిండా పని కల్పించేందుకు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమనకు మరిన్ని ఆర్డర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మున్సిపల్ మాజీ చైర్మన ఆడేపు రవీందర్, టౌన్ ప్రసిడెంట్ నాగుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు పత్తిపాక సురేష్, వేణు, మోర శ్రీహరి, నరేష్ సదానందం, ఊరగొండ రాజు, దాసరి శ్రీనివాస్, గాజుల వేణు, కోడం ఆనంద్ బాబు, దుమాల శ్రీకాంత్, కోడం శ్రీనివాస్, సుంచు ప్రకాష్, అంకారపు రాజు, గుడ్ల సురేష్, మెరుగు శ్రీనివాస్, కోరంపల్లి రమేష్ ,బాల్సాని అనిల్ బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత



- **కేసు నమోదు**
- **అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు**
- **ఎస్సై డి.సుధాకర్**

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండలంలోని దేశాయిపల్లి గ్రామ శివారులో గల వాగు నుండి నెరెళ్ళ గ్రామానికి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని సమాచారంతో తంగళ్ళపల్లి ఎస్సై.డి.సుధాకర్ మరియు సిబ్బంది మల్లేశం, కిరణ్, సంపత్ తో కలిసి వెళ్లి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ మహీంద్రా . టి ఎస్ 23టి7225ను పట్టుకొని కేసు నమోదు చేసి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేయడం జరిగింది. ఈ మేరకు తంగళ్ళపల్లి ఎస్ఐ డి సుధాకర్ వివరాలను తెలిపారు. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ మరియు ఓనర్ నేరేళ్ల గ్రామానికి చెందిన దాసరి రాజూ పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. అక్రమ ఇసుక రవాణా సమాచారం సేకరించిన కానిస్టేబుల్ లను ఎస్సై అభినందించారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే డయల్ 100

# బదిలీపై వెళుతున్న ఆడిట్ అధికారికి ఘన సన్మానం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న ఆలయము లోని లోకల్ ఫండ్ ఆడిట్ అధికారిగా విధులు నిర్వహిస్తూ హైదరాబాద్ జీహెచ్ఎంసీ ఆడిట్ అధికారిగా బదిలీపై వెళ్తున్న శ్రీ రమేష్ ని రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రతాప్ నవీన్ ,పర్యవేక్షకులు వెల్ది సంతోష్, అరుణ్, మహేష్ గౌడ్, మరియు సీనియర్ అసిస్టెంట్లు నూగురి నరేందర్, నక్క తిరుపతి ,పెరిక శ్రీనివాస్, ఎడ్ల సాయి , పురాణం వంశీ ,పోల్సాని రాజు పాల్గొన్నారు.





# ఆ నిబంధనల వల్ల రైతులకు రుణమాఫీ కావట్లేదు

- దివ్యాంగులపై స్మితా కామెంట్స్ సరికాదు
- మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హరీశ్‌రావు పంటల రుణమాఫీకి రేషన్ కార్డు, పీఎం కిసాన్ నిబంధన అమలు చేస్తున్నారు.. ఈ నిబంధనల వల్ల చాలా మంది రైతులకు రుణమాఫీ కావట్లేదు అని మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. పంటల రుణమాఫీకి రేషన్ కార్డు, పీఎం కిసాన్ నిబంధన అమలు చేస్తున్నారు.. ఈ నిబంధనల వల్ల చాలా మంది రైతులకు రుణమాఫీ కావట్లేదు అని తెలిపారు. రైతు రుణమాఫీలో కోతలు పెట్టేందుకే రేషన్ కార్డు, పీఎం కిసాన్ నిబంధనలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక విభాగాల వైద్యులను జిల్లాలకు బదిలీ చేశారని... అనుభవం ఉన్న వైద్యులను చిన్న ఆస్పత్రులకు బదిలీ చేశారని తెలిపారు. ప్రస్తుత విభాగాల్లోనే సూపర్ స్పెషాలిటీ నిపుణులను కొనసాగించాలన్నారు. ఉద్యోగులకు డీఏలు ఇస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ప్రతిపక్షం ఇస్తున్న సూచనలను ప్రభుత్వం పాటించాలి. దివ్యాంగులపై సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన కామెంట్స్ సరికాదని అన్నారు.దివ్యాంగులపై స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను సమర్థించను అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.వృద్ధాప్య పెన్షన్లు సమయానికి రావడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నిరుద్యోగులపై లాఠీలు ఝులిపిస్తున్నారు. పోలీసు శాఖలో డీజిల్ డబ్బులు ఇవ్వడం లేదు. హెూంగార్డులకు జీతాల్లేవు. కల్యాణలక్ష్మి పథకం ఆగిపోయింది. లక్ష మందికి పైగా చెక్కుల కోసం ఎదురుచూస్తున్నారు. రైతుబీమా చెక్కులకు కనీసం నెల సమయం పడుతోంది అని హరీశ్‌రావు తెలిపారు.

## రాజకీయాలకతీతంగా
# హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం



- డ్రగ్స్ ఫ్రీ సిటీ గా హైదారాబాద్
- డెంగ్యూ కేసులు రాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలి..
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా చర్యలు
- శాసన సభ సమావేశాల్లోపు హైదరాబాద్ సమస్యల పై ముఖ్యమంత్రితో నగర ఎమ్మెల్యేల భేటీ
- మంత్రి పొన్నం ప్రభాకర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగర ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా శాసన సభ బడ్జెట్ సమావేశాల్లోపు నగర అభివృద్ధి పలు నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలు ,బడ్జెట్ లో నగరానికి కావాల్సిన అవసరాల పై హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారి అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా అభివృద్ధి పై సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో నగర ఎమ్మెల్యేలు శ్రీ గణేష్,కాలేరు వెంకటేష్,ముఠా గోపాల్, ఎంఐఎం ఎమ్మెల్యేలు మహమ్మద్ ముబిన్, కౌసర్ మోహినుద్దీన్, అబ్దుల్లా బలాల , మాజిద్ హుస్సేన్ ,జాఫర్ హుస్సేన్ ఎమ్మెల్సీలు బలమురి వెంకట్ , ప్రభాకర్ రావు, మీర్జా రియాజ్ ఉల్ హుస్సేన్ ఎఫండి ,మీర్జా రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

శాసన సభ బడ్జెట్ సమావేశాల్లోపు రాజకీయాలకు అతీతంగా నగర ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కని కలిసి నగర అభివృద్ధికి కావాల్సిన అవసరాలు , పెండింగ్ బిల్లులు , నగరంలో జరుగుతున్న ఎస్ఆర్డిపి, ఎస్ఎన్డిపి పనుల పురోగతి తదితర అంశాలపై విజ్ఞప్తి చేయాలని సమావేశంలో చర్చించారు.. నగరంలో డెంగ్యూ కేసులు రాకుండా వైద్యాధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టాలని నీళ్ళు నిల్వ ఉండకుండా జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జీహెచ్ఎంసీ ,హెచ్ఎండిఎ,వాటర్ వర్క్స్ , ఎలక్ట్రిసిటీ పలు సమస్యలు , పెండింగ్ బిల్స్, ప్రస్తుతం వర్క్స్ కి అవసరమైన నిధులు హైదరాబాద్ అవసరాలు ఇవి అనే విధంగా ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ సిటీ కి తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కొన్ని మెడికల్ షాపులలో డ్రగ్స్ సంబంధిత ఔషధాలు బయటపడుతున్నాయన్న ఎమ్మెల్యేల పిర్యాదు తో అలాంటివి ఏం ఉన్న తక్షణమే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ పై తీసుకుంటున్న చర్యలు ,లా అండ్ ఆర్డర్ పై హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి ని అడిగి తెలుసుకున్నారు. నగరంలో గురుకులాలు ,ప్రభుత్వ హాస్టల్ లు , స్కూల్ లు తదితర వాటిపై ఎమ్మెల్యేలు అధికారులు తనిఖీ చేపట్టాలని కోరారు. అప్పుడే విద్యార్థులకు ఒక భరోసా ఇవ్వగలమని సూచించారు.. నగరంలో స్కూల్ లలో ఉన్న పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలో తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అధికారులను ఆదేశించారు.

అన్నిటినీ క్రోడీకరించి హైదరాబాద్ అభివృద్ధి పై ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ బ్రాండ్ ఇమెజ్ తగ్గకుండా మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమీక్షా సమావేశంలో భాగంగా నగర ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమస్యల పై మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వాటన్నిటిపై వెంటనే అధికారులతో మాట్లాడి అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశించారు. కంటోన్మెంట్ లో నీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని ఎమ్మెల్యే శ్రీ గణేష్ మంత్రి దృష్టికి తీసుకురాగా దానిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇతర అంశాలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి సమస్యలు పరిష్కారం చేసుకుందామని హామీ ఇచ్చారు..

అధికారులు వారి డిపార్ట్మెంట్ లలో తీసుకుంటున్న చర్యలపై సమావేశంలో చర్చించారు జీహెచ్ఎంసీ ,హైదరాబాద్ లా అండ్ ఆర్డర్,వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ తదితర అంశాలపై అధికారులు చర్చించారు.. సమావేశానికి పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రాపాలి , హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి ,హెచ్‌డబ్ల్యూఎంఎస్ అశోక్ రెడ్డి , సీడీపీసీఎంఎల్‌డీ ముస్తఫా ,అడిషనల్ సీపీ లా అండ్ ఆర్డర్ వీఎస్ మాన్ ,అడిషనల్ సీపీ ట్రాఫిక్ విశ్వ ప్రసాద్ ,సెంట్రల్ జోన్ డీసీపీ అక్షన్ష్ యాదవ్ వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు.

# పాతబస్తీలో కూలిన భారీ చెట్టు



- 12 మందికి తీవ్ర గాయాలు.

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పాతబస్తీ శాలిబండ పోలీసు స్టేషన్ పరిధిలోని షంశీర్ గంజ్‌లో సోమవారం మధ్యాహ్నం భారీ ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కనే ఉన్న ఓ భారీ వృక్షం కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు పక్కనే ఉన్న ఓ భారీ వృక్షం కుప్పకూలిపోయి ప్రధాన రహదారిపై విరిగి పడింది. దీంతో ఆ చెట్టు కింద పలు వాహనాలు ఇరుక్కుపోయాయి.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆలోపే స్థానికులు చెట్టు కొమ్మలను తొలగించి గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో మొత్తం 12 మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి.క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. బాధితుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చెట్టు కూలడంతో షంశీర్ గంజ్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు చెట్టును తొలగించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## ఆగస్టు 31 నాటికి
# ధూల్‌పేట్‌లో గంజాయి లేకుండా కట్టడి చేయాలి

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి ఆదేశాలు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గంజాయి అమ్మకాలకు కార్ఖానాగా మారిన ధూల్‌పేట్‌లో ఆగస్టు 31 నాటికి గంజాయి అమ్మకాలు, వినియోగం లేకుండా కట్టడి చేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి ఆదేశించారు. ఈ కట్టడి చేయాలంటే ఎక్సైజ్ శాఖకు పోలీసులు అన్ని విధాలా సహకరించాలన్నారు. సోమవారం అబ్కారీ భవన్‌లోని సమావేశ మందిరంలో ఎక్సైజ్, పోలీసులతో కో ఆర్డినేషన్ సమావేశం జరిగింది. ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌పై కఠిన చర్యలు చేపట్టి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఎక్సైజ్ శాఖ, పోలీసులు కలిసి ధూల్‌పేట్‌లో తనిఖీలు ముమ్మరం చేయాలని కోరారు. ప్రధానంగా ధూల్‌పేటకు గంజాయి ఎక్కడి నుంచి వస్తుంది..? ఎలా వస్తుంది..? తీసుకొస్తున్న వారెవరు..? కొనుగోలుదారులెవ్వరు..? ఎక్కడి నుంచి రవాణా అవుతుంది..? ఎక్కడి నుంచి ధూల్‌పేట్‌కు రవాణాగా వస్తుందనే విషయాలపై నిఘా పెట్టి గంజాయిని నియంత్రణలోకి తీసుకురావాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్కెరెక్టర్ ఆదేశించారు.ధూల్‌పేట్‌తోపాటు మిగతా ప్రాంతాల్లో కూడా గంజాయి, డ్రగ్స్‌పై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎక్సైజ్ పోలీసులకు పోలీసుల సహకారంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందించాలని కోరారు. హైదరాబాద్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ ప్రత్యేకంగా ధూల్‌పేట్‌పై నిఘా పెంచాలన్నారు. ఆగస్టు 31 నాటికి ధూల్‌పేట్‌ను గంజాయి ఫ్రీ ప్రాంతంగా మార్చాలన్నారు. ఈ సమావేశంలో సౌత్‌జోన్ డీసీపీ చందద్రమోహన్, అడిషనల్ డీసీపీ ముస్తాక్, ఏసీపీ భాస్కర్, ఏసీపీ మునావర్, ఎక్సైజ్ అండ్ ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, ఎక్సైజ్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ కమిషనర్ కేఏబీ శాస్త్రీ, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవీ, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, డీఎస్పీలు శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, ఈఎస్‌లు సిహెచ్ విజయ్, అంజి రెడ్డి, ప్రదీప్‌రావు, మంగళ్‌హాట్ సీఐ మహేష్, ధూల్‌పేట్ సీఐ మధుబాబు ఇతరలు పాల్గొన్నారు.

# ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఓటుకు నోటు కేసు విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు సీఎంగా ఉండటంతో విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో విచారణను హైదరాబాద్ హైకోర్టు నుంచి మధ్యప్రదేశ్ లోని భోపాల్ హైకోర్టుకు మార్చాలని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కౌంటర్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ ను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథ్ తో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. హైదరాబాద్ హైకోర్టు నుంచి పిటిషన్ ను ఎందుకు బదిలీ చేయాలో వివరణ ఇవ్వాలని పిటిషనర్ ను ధర్మాసనం ఆదేశించింది. నిందితుడిగా ఉన్న వ్యక్తి సీఎం అయితే కోర్టులు ఎలా ప్రభావితం అవుతాయని ప్రశ్నించింది. ప్రాసిక్యూట్ చేసే ఏజెన్సీలు తమ అభిప్రాయం, వాదన మార్చుకునే అవకాశాలున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. కేసులో ఆధారాలను తారు మారు చేయవచ్చని, సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించవచ్చని కోర్టుకు వివరించారు. ప్రభుత్వం సమర్పించిన కౌంటర్ పై రిజాయిండర్ దాఖలుకు రెండు వారాలు గడువు ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరగా అందుకు ధర్మాసనం సమ్మతించింది.

# కొత్త న్యాయ చట్టాలపై మీ వైఖరేంటీ..?



- ప్రభుత్వానికి కేటీఆర్ బహిరంగ లేఖ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బీజేపీ ప్రభుత్వం దేశంలో అమల్లోకి తెచ్చిన కొత్త న్యాయ చట్టాలు (భారత న్యాయ సంహిత)పై తెలంగాణ ప్రభుత్వ వైఖరేమిటో చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి సోమవారం కేటీఆర్ లేఖ రాశారు. వివిధ వర్గాల నుంచి కొత్త న్యాయ చట్టాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని.. ఈ చట్టాలలో ఉన్న పలు నిబంధనలు, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయన్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తున్నారన్నారు. నూతన చట్టాలపైన విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో వీటిపైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, ఇక్కడి కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కొత్త చట్టంలో నియంతృత్వపూరితంగా ఉన్న సెక్షన్లను తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో పాటు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాలని కోరారు. లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజా వ్యతిరేక, నిరంకుశ ప్రభుత్వంగా ప్రజలు పరిగణిస్తారని హెచ్చరించారు.

తెలంగాణ ప్రభుత్వానికి కేటీఆర్ రాసిన లేఖ యథాతథంగా... “తెలంగాణ అంటేనే పోరాటాల గడ్డ.. ఉద్యమాల అడ్డ. పౌరహక్కుల పరిరక్షణ కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడే స్వభావం ఉన్న నేల ఇది. ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉక్కు పిడికిళ్లు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. అలాంటి తెలంగాణ రాష్ట్రంలోనూ ఇటీవల కేంద్రం తెచ్చిన చట్టాలతో అలజడి రేగుతోంది. దేశంలో అమలులోకి వచ్చిన నూతన న్యాయ చట్టాల పైన అనేక ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకు అమలులో వున్న పాత చట్టాల స్థానాల్లో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలు జులై 1, సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. ఇండియన్ పీనల్ కోడ్ (ఐ.పి.సి), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సి.ఆర్.పి.సి), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐ.ఎ.ఎ) స్థానంలో భారతీయ న్యాయసంహిత (బి.ఎన్.ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బి.ఎన్.ఎస్.ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బి.ఎస్.ఎ) అమలులోకి వచ్చాయి. అయితే వివిధ వర్గాల నుంచి నూతన చట్టాలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చట్టాలలో ఉన్న పలు నిబంధలను, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని హక్కుల సంఘాలు, ప్రజా సంఘాల మేధావులు అభిప్రాయపడుతున్నారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరసనలు.. ఉద్యమాలు చేసే ప్రజలకు ప్రతికూలంగా కొత్త చట్టాలు వున్నాయని.. పోలీసులకు ప్రభుత్వానికి మితి మీరిన అధికారాన్ని కట్టబెడుతున్నాయని సామాజిక ఉద్యమకారులు అందోళన వ్యక్తం చేస్తున్నారు..! ప్రజాస్వామికవాదులు న్యాయ నిపుణుల మాత్రమే కాదు.. పలు రాష్ట్రాలు కూడా నూతన చట్టాలను వ్యతిరేకిస్తున్నాయి! పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు! తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, ఇక్కడి కాంగ్రెస్ పార్టీ తన వైఖరి ఏంటో స్పష్టంగా చెప్పలేదు! రేవంత్ రెడ్డి ఈ అంశంలో తన వైఖరిని స్పష్టం చేయాలి. న్యాయ కోవిదులు.. అనుభవజ్ఞులైన క్రిమినల్ లాయర్లు, దర్యాప్తు సంస్థలు, న్యాయమూర్తులు, సాధారణ పౌరులతో విస్తృత స్థాయిలో సంప్రదించి వారి అభిప్రాయాలను సేకరించకుండానే ఈ చట్టాలను తొందరపాటుతో తీసుకొచ్చారు. లోక్‌సభ, రాజ్యసభ నుంచి ఏకంగా 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి, ఏలాంటి చర్చ లేకుండా ఆమోదించిన చట్టాల అమలు నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఇప్పటికే పలు పిటిషన్లు దాఖలైయ్యాయి. మా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ యంపి ఈ చట్టాల అమలు నిలిపి వేయాలని సుప్రీం కోర్టులో కేసు వేశారు. ఈ చట్టాలలో ఉన్న పలు నిబంధలను, సెక్షన్లు అత్యంత దారుణంగా ప్రజల హక్కులను, స్వేచ్ఛను హరించేలా ఉన్నాయి. ఈ చట్టాల ప్రకారం నిందితులకు బెయిలిచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయి, పోలీసులకు, ప్రభుత్వానికి విపరీతమైన అధికారాలు సంక్రమిస్తాయి. ఇందులో పౌరుల హక్కులకు హాని కలిగించే కొన్ని ముఖ్యమైన అంశాలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ౹ ఈ చట్టాల ప్రకారం ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయడం ఈ కొత్త చట్టం ప్రకారం నేరం. ఇది అత్యంత దురదృష్టకరం. ఈ చట్టం ప్రజల హక్కుల కోసం పోరాటం చేసే పౌరులకు ప్రమాదకారిగా మారుతుంది. గతంలో ఉన్న 15 రోజుల పోలీసు కస్టడీ ఇప్పుడు 90 రోజులకు పెంచడం జరిగింది. ఈ తొంబై రోజు గడువును ఉపయోగించుకుని ఎన్ని సార్లయిన కస్టడీలోకి తీసుకునే అవకాశం కల్పిస్తుంది. ఈ కస్టడీని ఒకే దఫాలో కానీ పలు దఫాలలో గానీ అమలు పరచవచ్చు. తద్వారా నిందితుడికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా కూడా పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంటుంది. ౹ క్రిమినల్ కేసులో ఉన్న నిందితుల ఆస్తులను జప్తు చేయడానికి కోర్టు అనుమతి అవసరం ఉండేది. అయితే కొత్త చట్టంలో పోలీసులకు పూర్తి అనుమతి లభించింది. వ్యవస్థీకృత నేరాలకు వ్యక్తులను ప్రాసిక్యూట్ చేయడానికి దర్యాప్తు సంస్థలకు ఏకపక్ష మరియు విచక్షణ అధికారాలను కొత్త చట్టం అనుమతిస్తుంది. జాతీయ భావాలను ప్రభావితం చేసే నేరాలకు 3 సంవత్సరాల జైలు శిక్ష మరియు జరిమానా. సైబర్ నేరాలు, హ్యాకింగ్, ఆర్థిక నేరాలు, గోప్యత మరియు సాంకేతికత ద్వారా విధ్వంసం వంటి వాటి కోసం రూపొందించిన ప్రత్యేక అధ్యాయంలో అనేక అస్పష్టతలున్నాయి. కొత్త చట్టాల అమలుకు ముందు (2024 జులై 1వ తేదీకి ముందు) జరిగిన నేరాలను ఐపీసీ తదితర పాత చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుంది. తర్వాత నమోదు అయ్యే కేసులను నూతన చట్టాల ప్రకారం విచారణ చేయాల్సి వస్తుంది. ఇది అందరినీ అయోమయంలో నెడుతున్నది. ‘స్వాతంత్ర్యోద్యమంలో నాటి జాతీయ నాయకులను జైళ్లలో పెట్టడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఉపయోగించిన ‘రాజద్రోహం’ చట్టం అమలును సుప్రీంకోర్టు 2022లో నిలిపివేసింది. ఈ చట్టంపై సమీక్ష జరుపుతామని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. కానీ, కొత్త చట్టంలో తిరిగి ‘రాజ ద్రోహం’ చట్టాన్ని ‘దేశ ద్రోహం’ పేరుతో తీసుకొచ్చింది. ప్రభుత్వ విధానాలను విమర్శించడానికి ప్రజలకు ఉన్న హక్కును కాలరాసేందుకే ఈ చట్టం ఉపయోగపడుతుందన్న విమర్శలున్నాయి. నూతన చట్టాల పైన విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో వీటిపైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, ఇక్కడి కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని వెల్లడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల మాదిరి రేవంత్ రెడ్డి ఈ అంశంలో తన వైఖరిని స్పష్టం చేయాలి. ప్రజా ఉద్యమాలకు దశాబ్దాలుగా కేరాఫ్ అడ్రస్ గా ఉన్న తెలంగాణ గడ్డ పైన నిరంకుశ నియంతృత్వ నూతన క్రిమినల్ చట్టాలను ఇక్కడ యధాతథంగా అమలు చేయడమే రాష్ట్ర సర్కారు లక్ష్యమా.. లేక ఇతర రాష్ట్రాల మాదిరిగా సవరణలు తీసుకొస్తారా అనే విషయాన్ని ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టం చేయాలి. నూతన చట్టాల్లో పేర్కొన్న అనేక సెక్షన్ల వల్ల రాష్ట్రంలో పోలీస్ రాజ్యాన్ని తీసుకువచ్చే ప్రమాదం ఉన్నది. గత ఏడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న విద్యార్థులను యువకులను నిరుద్యోగులను సోషల్ మీడియా కార్యకర్తలను ఎక్కడికక్కడ అణిచివేసేందుకు పోలీసులను విస్తృతంగా వినియోగిస్తున్నది. నూతన చట్టాల నేపథ్యంలో ఈ పరిణామాలు మరింత దుర్మార్గమైన వాతావరణాన్ని రాష్ట్రంలో నెలకొల్పే ప్రమాదం ఉన్నది. ప్రజా పాలన అంటూ చెప్పుకునే ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ నూతన చట్టాలపై తన వైఖరి తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఈ ప్రమాదకర చట్టాలపై తన వ్యతిరేకతను ఇప్పటికే తెలియజేసింది అయితే ఈ అంశంలో స్థానికంగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటిదాకా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ అంశంలో ఇప్పటికైనా రేవంత్ సర్కారు వెంటనే తన నిర్ణయాన్ని ప్రకటించాలి. నూతన చట్టాల్లో ఉన్న నియంతృత్వ పూరిత సెక్షన్లను సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి వెంటనే లేఖ రాయాలి. దీంతోపాటు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రం తరపున ఒక తీర్మానాన్ని కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేస్తున్నాను. ప్రజలను పౌరులను అణిచివేసే చట్టాలపైన అందులోని సెక్షన్ల పైన రాష్ట్ర పరిధిలో ఉన్న చట్టపరమైన పరిధి మేరకు ఒక కమిటీని వెంటనే నియమించి ఈ చట్టాల పైన తీసుకోవాల్సిన అంశాల పైన చర్చించాలి. లేకుంటే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు నిరంకుశ ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా పరిగణిస్తారని గుర్తుంచుకోవాలని తెలియజేస్తున్నాను’ అని లేఖలో పేర్కొన్నారు.

# లంకకు చేరుకున్న భారత ఆటగాళ్లు

- 27న తొలి టీ20
- కోచ్‌గా గంభీర్‌కు, కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్‌కు పరీక్ష

**బలగం టీవీ, స్పోర్ట్స్ బ్యూరో**

భారత క్రికెట్ జట్టు శ్రీలంకలో అడుగుపెట్టింది. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ నేతృత్వంలోని టీమిండియా బృందం సోమవారం లంకకు చేరుకుంది. విమానాశ్రయంలో టీమిండియా క్రికెటర్లకు ఘన స్వాగతం లభించింది. అనంతరం జట్టు నేరుగా హోటల్‌కు వెళ్లింది.టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్‌లు అక్కడ అభిమానులకు, భద్రతా సిబ్బందికి అభివాదం చేస్తూ కనిపించారు. ఆ ఫొటోలను శ్రీలంక క్రికెట్ తమ అధికారిక ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. లంకకు వెళ్లిన భారత బృందంలో సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు లేరు. పొట్టి ప్రపంచ కప్ తర్వాత బ్రేక్ తీసుకున్న ఈ ఇద్దరూ వన్డే సిరీస్ సమయానికి జట్టుతో కలవనున్నారు.

శ్రీలంక పర్యటనలో భారత జట్టు మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. జూలై 27న జరిగే టీ20తో సిరీస్ మొదలవ్వనుంది. ఈ సిరీస్ కోసం బీసీసీఐ ఇప్పటికే స్క్వాడ్‌ను





ప్రకటించిన విషయం తెలిసిందే. హెడ్‌కోచ్ గంభీర్, అసిస్టెంట్ కోచ్‌లు అభిషేక్ నాయర్, రియాన్ డస్కేట్‌లకు ఈ సిరీస్ తొలి పరీక్ష. ఈ ముగ్గురి పని తీరుకు లంక పర్యటన కొలమానం కానుంది. దాంతో, తమ మార్క్ చూపేందుకు ఈ ఐపీఎల్ త్రయం వ్యూహ రచనకు సిద్ధమైంది.

# అమ్మాయిల వరల్డ్ కప్‌లో 16 జట్లు..

- ఐసీసీ కీలక నిర్ణయం
- 2030 నుంచి అమలు..

**బలగం టీవీ, స్పోర్ట్స్ బ్యూరో**

మహిళల పొట్టి ప్రపంచ కప్ టోర్నీకి మరింత ఆకర్షణ తెచ్చేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. పురుషుల టోర్నీ మాదిరిగానే అమ్మాయిల జట్ల సంఖ్యను కూడా పెంచనుంది. ఇకపై మహిళల పొట్టి ప్రపంచ కప్‌లో 16 జట్లకు చాన్స్ ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. అయితే.. ఈ నియమాన్ని 2030లోజరుగబోయే మహిళల టీ20 వరల్డ్ కప్‌లో ప్రవేశపెట్టాలని ఐసీసీ భావిస్తోంది. ఇప్పటివరకూ మెగా ఈవెంట్‌లో 12 జట్లు మాత్రమే ఆడుతున్నాయి. అయితే.. ఈమధ్య కాలంలో పలు దేశాలు మహిళా క్రికెట్‌ను ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా దేశాల జట్లకు కూడా అంతర్జాతీయ వేదికపై ఆడే చాన్స్ ఇవ్వాలనే ఉద్దేశంతో ఐసీసీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

'మహిళల పొట్టి వరల్డ్ కప్‌ను 20230 నుంచి 16 జట్ల టోర్నీగా నిర్వహించేందుకు ఐసీసీ అంగీకరించింది. పురుషులతో సమానంగా మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. తొలి ఎడిషన్‌లో 8 జట్లు పాల్గొనగా 2016కి ఆ సంఖ్య 10కి చేరింది. 2026లో జరిగే ప్రపంచ కప్‌లో 12 జట్లు ఆడనున్నాయి. 2030లో జరిగే టోర్నీలో 16 టీమ్‌లు పాల్గొంటాయి' అని ఐసీసీ ఓ ప్రకటనలో వెల్లడించింది.ఈ ఏడాది అక్టోబర్‌లో బంగ్లాదేశ్ వేదికగా టీ20 వరల్డ్ కప్ జరుగనుంది. అనంతరం 2026లో మెగా టోర్నీకి ఇంగ్లండ్ ఆతిథ్యమివ్వనుంది. ఈ రెండు టోర్నీల్లోనూ 12 జట్లను మాత్రమే ఐసీసీ అనుమతించనుంది. 2030 నుంచి 16 జట్లతో కొత్తగా టోర్నీని నిర్వహించేందుకు ఐసీసీ సన్నాహకాలు చేస్తోంది.



# బోణీ కొట్టిన బంగ్లాదేశ్



**బలగం టీవీ, స్పోర్ట్స్ బ్యూరో**

మహిళల ఆసియా కప్‌లో బంగ్లాదేశ్ బోణీ కొట్టింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి థాయ్‌లాండ్ ను చిత్తు చేసింది. స్వల్ప లక్ష్యాన్ని బంగ్లాదేశ్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. సెమీస్ రేసులో నిలవాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో విజయం సాధించి పాయింట్ల ఖాతా తెరిచింది.

సోమవారం దంబుల్లా స్టేడియంలో మ్యాచ్ జరగగా థాయ్‌లాండ్ జట్టు 96 పరుగులకే పరిమితమైంది. స్వల్ప లక్ష్య ఛేదనను బంగ్లా ఓపెనర్లు నిదానంగా ఆరంభించారు. దిలారా అఖ్తర్(17), ముర్షిదా ఖాతున్(50)లు తొలి వికెట్‌కు రన్స్ జోడించారు. దిలారా రనౌట్ అయ్యాక ముర్షిదా థాయ్ బౌలర్లపై విరుచుకుపడి బౌండరీలతో చెలరేగింది. బంగ్లా విజయానికి 10 పరుగులు అవసరం అనగా.. ఫన్నితా బౌలింగ్‌లో ముర్షిదా ఔటయ్యింది. ఆ తర్వాత రీతూ మోనీ(9 నాటౌట్), రుమనా అహ్మద్(5 నాటౌట్)లు లాంఛనం ముగించారు. స్పిన్ మ్యాజిక్‌తో థాయ్ జట్టు నడ్డివిరిచిన రబియాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న థాయ్‌లాండ్‌కు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. నథాయ బుచ్చాథామ్(40) బంగ్లా బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నది. అయితే.. లెగ్ స్పిన్నర్ రబియా ఖాన్ ఎంట్రీతో సీన్ మారిపోయింది. పవర్ ప్లే తర్వాత బంతి అందుకున్న రబియా థాయ్ బ్యాటర్ల పని పట్టింది.

# గిల్‌ను భవిష్య కెప్టెన్‌గా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం

- బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కార్

**బలగం టీవీ, స్పోర్ట్స్ బ్యూరో**


టీమిండియా భవిష్య కెప్టెన్ ఎవరు? అనే ప్రశ్నకు బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కార్ తెరదించాడు. భారత యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌ను పూర్తిస్థాయి కెప్టెన్‌గా చూసే అవకాశం ఉందని క్లారిటీ ఇచ్చాడు. అయితే ఏ విషయంలోనూ తాము క్లారిటీ ఇవ్వలేమని చెప్పాడు. సోమవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. మూడు ఫార్మాట్లలోనూ గిల్ రాణించగలడని, అతడో కీలక ఆటగాడు అని తెలిపాడు. గత ఏడాది నుంచి అతడు అద్భుతంగా ఆడుతున్నాడని కొనియాడాడు. సూర్య, రోహిత్ ఉన్నపుడే.. నాయకుడి నైపుణ్యాలు మెరుగు పరచుకునేలా గిల్‌కి శిక్షణ ఇవ్వాలని అన్నాడు. ఉన్నట్లుండి ఒక్కసారిగా కొత్త కెప్టెన్‌ను ట్రై చేయాలంటే కష్టమవుతుందని.. అందుకే ఇప్పటి నుంచే అతనిని భవిష్య కెప్టెన్‌గా తీర్చిదిద్దాలని భావిస్తున్నామని పేర్కొన్నాడు. అయితే.. ఇందుకు చాలా సమయం ఉందని, ఇప్పుడే ఏదీ కచ్చితంగా చెప్పలేమనడం కొసమెరుపు. రెండేళ్లపాటు అతడిని గమనిస్తూనే ఉంటామని వెల్లడించాడు. నిజానికి.. ఈ కెప్టెన్సీ రేసులో గిల్ కంటే ముందు రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా వంటి సీనియర్లు ఉన్నారని... అయితే.. ఆయా కారణాల దృష్ట్యా వారిని పక్కన పెట్టి, గిల్‌కే పట్టం కట్టాల్సి వచ్చిందని అజిత్ అగార్కర్ చెప్పాడు. రోడ్డు ప్రమాదం





కారణంగా రిషభ్ పంత్ చాలాకాలం పాటు ఆటకు దూరమయ్యాడని, ఏడాదిన్నర తర్వాత జట్టులోకి వచ్చిన అతనిపై భారం మోపాలని భావించడం లేదన్నాడు. అలాగే.. కేఎల్ రాహుల్ చాలాకాలంగా టీ20లకు దూరంగా ఉన్నాడని, ఇక హార్దిక్ ఫిట్‌నెస్ దృష్ట్యా అతడినీ ఎంపిక చేయలేదని క్లారిటీ ఇచ్చాడు. గతంలో తాము టీ20 కెప్టెన్ విషయంలో చాలా సమస్యలు ఎదుర్కొన్నామని.. మరోసారి అలాంటి రిస్కులు చేసేందుకు సిద్ధంగా లేమని అగార్కర్ చెప్పుకొచ్చాడు.

# 'కన్నప్ప' నుంచి శరత్ కుమార్ లుక్ రిలీజ్




**బలగం టీవీ, సినిమా బ్యూరో**

మంచు విష్ణు 'కన్నప్ప' నుంచి శరత్ కుమార్ ఫస్ట్ లుక్ రిలీజ్ అయ్యింది. మంచు విష్ణు ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప'. మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్నది. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్ విడుదల చేయగా ఈ సినిమా నుంచి తాజాగా మరో క్రేజీ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమాలో తమిళ నటుడు శరత్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా శరత్ కుమార్ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాలో శరత్ కుమార్ నాథనాధుడు అనే కోయ దొర పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించారు. ఈ కోయలు పాండవ రాజు భీమసేనుడు -హిడింబి వారసులు. వీళ్ల నాయకుడు నాథనాధుడు అంటూ తెలిపారు. వీరి ఆయుధాలు విల్లు, బాణాలు అంటూ రాసుకొచ్చారు.



## మోస్ట్ పాప్యులర్ హీరోగా ప్రభాస్


**బలగం టీవీ, సినిమా బ్యూరో**

దేశంలోనే మోస్ట్ పాప్యులర్ హీరోగా డార్లింగ్ ప్రభాస్ నిలిచారని ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ పేర్కొంది. ఈమేరకు మోస్ట్ పాప్యులర్ జాబితాను విడుదల చేసింది. కల్కి సినిమా సంచలన విజయంతో ప్రభాస్ అభిమానుల హృదయాలను కొల్లగొట్టారని తెలిపింది. ఆయన తర్వాతి స్థానంలో బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ ఉన్నట్లు వెల్లడించింది. కాగా, మే నెలలో విడుదల చేసిన జాబితాలోనూ ప్రభాస్ అగ్రస్థానంలో ఉన్నారు.జూన్ నెలకు సంబంధించిన జాబితాను తాజాగా విడుదల చేయగా.. ఇందులో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ నాలుగో స్థానంలో, యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ ఐదో స్థానంలో ఉన్నారు. 'గేమ్ ఛేంజర్'తో త్వరలో థియేటర్లలో సందడి చేయనున్న రామ్ చరణ్ ఈ జాబితాలో తొమ్మిదో స్థానంలో ఉన్నారు. ఇక హీరోయిన్ ల విషయానికి వస్తే ఆలియా భట్ మొదటి స్థానంలో, సమంత, దీపిక పడుకొణే రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.

## త్వరలో ఉప ఎన్నికలు

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు డిస్ క్వాలిఫై అవుతారని, త్వరలోనే రాష్ట్రంలో ఉప ఎన్నికలు జరుగుతాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సాంకేతిక సమస్య పేరుతో నిలిపివేసిన రుణమాఫీని రైతులందరికీ వర్తించేలా చూడాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. సాంకేతిక లోపం పేరుతో కొందరికే రుణమాఫీ వర్తింపజేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. రుణమాఫీ జరుగుతుందనుకున్న రైతుల ఆశలు అడియాసలు అయ్యాయి అన్నారు. రైతుబంధు డబ్బులను రుణమాఫీకి మళ్లించినట్టు ఆరోపించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు రూ.39 కోట్ల రుణమాఫీ కావాల్సి ఉండగా.. కేవలం రూ.11 కోట్లు మాత్రమే చెల్లించి ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ప్రస్తుతం ఎన్నికలు లేవనీ, ఓట్లతో పని లేకపోవడంతో రైతుబంధును పోస్ట్‌పోన్ చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారం రైతుబంధు పథకం, వ్యవసాయాన్ని నీరుగార్చేలా ఉందన్నారు. ఎలాంటి నియమనిబంధనలు లేకుండా అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నింటినీ నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఎండగడుతామని చెప్పారు. రైతుబంధు పథకంలో లోపాలను ఎత్తిచూపుతో అసెంబ్లీలో చర్చ పెట్టి కొత్త నిబంధనలను చేర్చడం చూస్తుంటే పథకాన్ని ప్రభుత్వం నీరుగార్చే విధంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.

# భద్రాచలం వద్ద పెరిగిన నీటి మట్టం



## రెండో ప్రమాద హెచ్చరిక జారీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరింది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఆదివారం రాత్రి భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం 44 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం 46 అడుగుల వద్ద ప్రవహించింది. మధ్యాహ్నం 2 గంటల సమయానికి 48 అడుగులు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అయితే ఎగువన ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో నది ఉగ్రరూపం దాల్చింది. సాయంత్రం నాటికి నదీ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదారమ్మ మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్నది. మొదటి ప్రమాద హెచ్చరిక 14.830 మీటర్లు కాగా, ప్రస్తుతం 15.130 మీటర్లు వుంది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రతగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.భద్రాద్రి జిల్లాలో ఉన్న రెండు ప్రాజెక్టులకు వరద నీరు చేరింది. కిన్నెరసానిలో 16 వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదలిపెట్టారు. 407 అడుగుల నీటి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 403.30 అడుగులు నీటిమట్టం ఉంది. సాయంత్రానికి ఆరు గేట్లు ఎత్తివేశారు. చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టులో మొత్తం 25 గేట్లను ఎత్తి 92,121 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. గోదావరి వరద ప్రభావం వల్ల అక్కడ ఈతవాగు పొంగడంతో గుంపల్లి చర్ల గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. పర్ణశాలలో సీతవాగు పొంగి ప్రవహిస్తోంది. దుమ్ముగూడెం మండలంలో గుబ్బలమంగి ప్రాజెక్టులో భారీగా వరదనీరు చేరడంతో సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. దీంతో అధికారులు అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

## ఆరోగ్యశ్రీ ధరల సవరింపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ చికిత్సకు సంబంధించిన ధరలను సవరించింది. ఈ మేరకు 1,375 ప్యాకేజీల ధరలను సవరిస్తూ జీవో 30ని జారీ చేసింది. మిగిలిన 297 ప్యాకేజీ ధరల్లో మార్పు లేదని స్పష్టం చేసింది. అదే సమయంలో కొత్తగా 163 చికిత్సలను చేరుస్తూ నిర్ణయం తీసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సగటున 20శాతం రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆరోగ్యశ్రీలో కొత్తగా తీసుకున్న నిర్ణయాలతో ప్రభుత్వంపై రూ.438 కోట్ల భారం పడుతుందన్నారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి అదనపు ఖర్చు రూ.600 కోట్లు పెరిగిందన్నారు. ట్రస్ట్ ద్వారా దాదాపు 6 లక్షల మందికి బాసటగా ఉందన్నారు. కొత్త ప్రొసీజర్స్‌తో మరో లక్షన్నర కుటుంబాలను ఆదుకోబోతుందన్నారు. 79లక్షల కుటుంబాలకు ఆరోగ్యపరంగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇదిలా ఉండగా.. ఆరోగ్యశ్రీ పేదలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించే పథకాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే.